క్లుప్తంగా

ఘనంగా దొమ్మేటి జయంతి

రంగంపేట: స్థానిక బీసీ రామాలయం వద్ద రాష్ట్ర శెట్టిబలిజ సంఘం వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల బీసీ సంఘం అధ్యక్షుడు కేతా సత్తిబాబు, మాజీ సర్పంచ్ మేడిశెట్టి రవిశంకర్‌లు వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, భీమార్జున్, కడియాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

మధురపూడి: కోరుకొండ పంచాయతీ పరిధిలో ఆశీల వసూలు, కబేళా నిర్వహణ కోసం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సెక్రటరీ పి.రమేష్ బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి నుంచి 2024 మార్చి 31 వరకూ (ఒక ఏడాది) రోజువారీ ఆశీల వసూలు, కబేళా నిర్వహించడానికి ఈ వేలం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనే వారు నిర్ణీత ధరావత్తుగా రూ.20 వేలు చెల్లించాలన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు



కోరుకొండలో వ్యర్థాల తొలగింపు పనులు

మధురపూడి: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా కోరుకొండ పంచాయతీలో ఉదయమే చెత్తను తొలగించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో సంబంధిత సెక్రటరీ, పాలకమండళ్లు ఈ చర్యలు తీసుకుంటున్నాయి. మురుగునీటి కాలువల శుభ్రం, చెత్త, వ్యర్థాల తొలగింపు పనులు జరుగుతున్నాయి. అకాల వర్షాలు, వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలకు అనారోగ్యాలు సోకకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. దానిలో భాగంగానే మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో సెక్రటరీల ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు 26 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు లెక్కలు పేపర్–1బి, బయోలజీ పేపర్–1 పరీక్షలు నిర్వహించారు. పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 214 మంది హాజరు కావాల్సి ఉండగా 204 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 212 మంది హాజరు కావాల్సి ఉండగా 199 మంది హాజరయ్యారని, మొత్తంగా 26 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రామకృష్ణ, సీహెచ్ఏ శిరీషలు తెలిపారు.

ఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీసూర్యనారాయణమూర్తి స్వామి వారి ఆలయ ఇన్‌చార్జి ఈఓగా వడ్డాది సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకూ ఈఓగా పని చేస్తున్న కె.గాయత్రి సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన ప్రస్తుతం పెదపూడి గ్రూప్ ఆలయాలకు ఈఓగా పనిచేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: దివాన్ చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కేవీ ఫీడర్లకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. దీంతో దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీరామపురంలో గృహవినియోదారులు, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

కరకుదురులో శ్రీరామ సప్తాహాలు



కరకుదురు సప్తాహంలో పాల్గొన్న భక్తులు

పెదపూడి: కరకుదురు గ్రామంలో శ్రీరామ సప్తాహాల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన భక్తి మండలి సభ్యులు రామభక్తి గీతాలు ఆలపించారు. గురువారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ చంద్రకళ, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణలు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

ఇంతింతై... పదింతలై

- అనపర్తి ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు
- ఈ నెల 25న లాంఛనంగా ప్రారంభించనున్న కలెక్టర్ మాధవీలత



అనపర్తి ఏరియా ఆసుపత్రి

అనపర్తి: ఒకప్పుడు అరకొర మందులు, వసతులు, కాలం చెల్లిన పరికరాలు, చాలీచాలని బెడ్లు.. ఇదీ ప్రభుత్వాసుపత్రుల దుస్థితి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టపరచడం, 108, 104 వాహనాలతో పాటు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రజల చెంతకు తెచ్చింది. సచివాలయ స్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. అక్కడితో ఆగకుండా ప్రభుత్వాసుపత్రుల స్థాయిని పెంచడమే కాకుండా సకల వసతుల్ని కల్పిస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 30 పడకల నుంచి 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన అనపర్తి ఏరియా ఆసుపత్రిని ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కె.మాధవీలత లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఆసుపత్రి అభివృద్ధి చెందిన పరిణామ క్రమంపై కథనం..

పెరిగి... తరిగి... తిరిగి వంద పడకల స్థాయికి..

1958లో అనపర్తిలో ఏర్పాటైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2007లో సామాజిక ఆరోగ్యకేంద్రంగా స్థాయి పెంచారు. 2013లో అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి కృషితో సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యంతో అది కాస్తా 30 పడకల ఆసుపత్రిగానే కొనసాగింది. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో వైద్యుడైన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అనపర్తి సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలంటూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. సీఎం ఆదేశాలతో సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా స్థాయి పెంచుతూ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది.

అందుబాటులోకి స్పెషలిస్ట్ డాక్టర్స్, వైద్య సిబ్బంది

ఏరియా ఆసుపత్రిగా స్థాయి పెంపు జరగడంతో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులు పెరిగాయి. దీంతో ఏరియా అసుపత్రికి 23 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 73 మంది పారామెడికల్ సిబ్బంది మొత్తం 96 మంది సిబ్బందిని కేటాయించారు. ప్రస్తుతం నలుగురు సివిల్ సర్జన్లు, ఇద్దరు డిప్యూటీ సివిల్ సర్జన్లు, 11 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్లతో 17 మంది స్టాఫ్ నర్సులు, నలుగురు హెడ్ నర్సులు, రేడియోగ్రాఫర్ మొత్తం 68 మంది విధుల్లో చేరారు. మరో 28 మంది విధుల్లో చేరనున్నారు. వీరితో పాటు డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాం(డీఆర్‌పీ)లో భాగంగా రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన 12 మంది మెడికల్ పీజీ విద్యార్థులు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రిలో రోగులకు రక్త పరీక్షలు నిర్వహించేందుకుగాను సుమారు రూ.50 లక్షల విలువైన అధునాతన ఆటో ఎనలైజర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే 5 ఆక్సిజన్ వెంటిలేటర్లు మంజూరయ్యాయి.

ప్రజలకు మెరుగైన సేవలు



ఏరియా ఆసుపత్రి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. సీహెచ్‌సీగా ఉన్న సమయంలో రోజుకు సుమారు 150 ఉన్న ఓపీ రోజురోజుకీ బాగా పెరుగుతోంది. నిష్ణాతులైన వైద్యుల నియామకంతో వైద్య సేవలతో పాటు శస్త్ర చికిత్సలు సైతం ఎక్కువగా జరుగుతున్నాయి.

– డాక్టర్ టి.రామగుర్రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, అనపర్తి

ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది



అనపర్తి సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా మార్పు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే దానికి అనుగుణంగా ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ తీరడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే, అనపర్తి

చక్రవర్తి మాస్టారు సేవలు ఎనలేనివి



చక్రవర్తి మాస్టారు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రంగంపేట: చిన్న దొడ్డిగుంట ఎంపీపీ పాఠశాల అభివృద్ధికి చక్రవర్తి మాస్టారు చేసిన సేవలు ఎనలేనివని అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు అన్నారు. చిన్నదొడ్డిగుంట ఎంపీపీ పాఠశాలలో గురువారం జరిగిన పూర్వపు ప్రధానోపాధ్యాయుడు నందిగాం కల్యాణచక్రవర్తి వీడ్కోలు సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీనియర్ ఉపాధ్యాయుడిగా మండల విద్యాశాఖ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో చక్రవర్తి కృషి అభినందనీయమని ఎంఈఓ కె.శ్రీనివాసరావు కొనియాడారు. అనంతరం చక్రవర్తి మాస్టారు, ఉమామణి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.సత్యనారాయణ, వీసీ జాకబ్, కె.ధర్మరాజు, హైస్కూల్ హెచ్ఎం ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



బొబ్బిల్లంకలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

సీతానగరం: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.ఇందిరా భారతి ఆధ్వర్యంలో గురువారం బొబ్బిల్లంక అంగన్‌వాడీ కేంద్రం–2లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. బొబ్బిల్లంకలోని ఐదు అంగన్‌వాడీ సెంటర్లకు చెందిన గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఇందిరా భారతి మాట్లాడుతూ చిరుధాన్యాలు వాడటం ఆరోగ్యానికి చాలామంచిదన్నారు. మినుములతో తయారు చేసిన ఆవడ, మినపరొట్టె, సున్నుండలు, గుమ్మడి వడియాలు, బూరెలు, గారెలు, కారం పొడి, బెల్లం గారెలు వంటి పలు వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వి.రాధారాణి, జె.గంగాభవానీ, ఎస్.పద్మ, బి.మణి, ఎల్.సరోజ, ఏఎన్ఎం దేవి పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



సత్తెమ్మతల్లికి పూజలు చేస్తున్న మహిళలు

రంగంపేట: స్థానిక పామాయిల్ తోటలో కొలువైన సత్తెమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం సుమారు 3 వేల మందికి అన్నసమారాధన చేసినట్లుగా ఆలయ నిర్వాహకుడు కంటిపూడి ఆనందరావు చెప్పారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రంగంపేట: దొడ్డిగుంట ఉన్నత పాఠశాలలో మండల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు కె.నాని మాట్లాడుతూ యువత భగత్‌సింగ్‌ని స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అపురూప్, దొర, సాగర్, విలియమ్స్, శ్యామ్, జయశ్రీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

పెదపూడి: దేశానికి స్వాతంత్ర్యం తేవడం కోసం పోరాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లాంటి మహనీయుల్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.రాజబాబు పిలుపునిచ్చారు. పెదపూడి కైకవోలు సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు, వడ్లమూరి మంగాదేవి, అప్పలస్వామి, వల్లూరి సత్తిబాబు, శ్రీను, నాని, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా గురువారం సీతానగరం బస్టాండ్ సెంటర్ సమీపంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సిద్ధి నాగరాజు, నందమూరి చిట్టిస్వామి, తెలగరపు రమేష్, ఎస్.నాని పాల్గొన్నారు.

'దేశానికి మోదాని ముప్పు' పుస్తకావిష్కరణ

ప్రకాశం నగర్: ప్రజలకు వాస్తవాలను వివరించడానికి పుస్తక ప్రచురణలు ఎంతో ఉపయోగపడతాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ రూపొందించిన 'దేశానికి మోదాని ముప్పు' అనే పుస్తకాన్ని గురువారం స్థానిక ప్రకాశం నగర్ రౌండ్ పార్క్ ధర్మంచర కమ్యూనిటీ హాల్లో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఉండవల్లి అరుణ్ కుమార్ విచ్చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశసంపదను అదానీకి దోచిపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, చాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, సీనియర్ పాత్రికేయులు కృష్ణకుమార్, నాయకులు పి.తులసి, బి.రాజులోవ పాల్గొన్నారు.

రేపు 'నన్నయ'లో మేనేజ్‌మెంట్ ఫెస్ట్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రసాదరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'సవిస్కార్ 2 కె 23' పేరిట మేనేజ్‌మెంట్ ఫెస్ట్ జరగనుంది. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు గురువారం విడుదల చేశారు. విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్, అర్గనైజింగ్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్ వంటి నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, డాక్టర్ పి.ఉమామహేశ్వరి దేవి, డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి సీడీపీఓ టి.నాగమణి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మండలాల వారీగా రాజానగరంలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక సహాయకురాలు, రాజమహేంద్రవరం రూరల్‌లో ఒక సహాయకురాలు, కడియంలో మూడు సహాయకుల పోస్టులు ఖాళీలున్నాయి. ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను తీసుకుని, పూర్తి చేసి, మార్చి 31లోగా అందజేయాలన్నారు. కార్యకర్తల పోస్టులు పాలచర్ల–2 (ఎస్టీ), తోకాడ–2 (జనరల్) ఖాళీగా ఉన్నాయి. సహాయకురాల పోస్టులు దివాన్‌చెరువు–3 (జనరల్), ధవళేశ్వరం–14 (బీసీ–ఈ), కడియపులంక–8లో (జనరల్), కడియం సావరం–2లో (జనరల్), దుళ్ల–6 (ఎస్సీ) ఖాళీలను భర్తీ చేయనున్నారు.

సీతానగరం, కోరుకొండ మండలాల్లో..

సీతానగరం/మధురపూడి: అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు ఈనెల 31 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీ గురువారం ప్రకటనలో తెలిపారు. సీతానగరం మండలంలో వెదుళ్లపల్లి పంచాయతీ పరిధి రాజంపేట (ఓసీ జనరల్,) కాటవరం–1 (ఓసీ, ఎక్స్ సర్వీస్‌మెన్), వంగలపూడి–2 (బీసీ –ఈ) ఖాళీగా ఉన్నాయి. కోరుకొండ మండలం బూరుగుపూడి–5 (ఎస్‌సి), శ్రీరంగపట్నం–2 (బీసీ–బీ), శ్రీరంగపట్నం–4 (ఓసీ జనరల్) ఖాళీగా ఉన్నాయి. దరఖాస్తులను కోరుకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేసి, రశీదులు పొందాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

కడియం: మాధవరాయుడుపాలెంలోని భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. అన్నందేవుల మణీందర్, ప్రేమ దంపతుల కలశ స్థాపనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బాలా త్రిపురసుందరీ పీఠం నిర్వాహకుడు గరిమెళ్ల వెంకట రమణశాస్త్రి ఆధ్వర్యంలో పదహారుమంది వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు ప్రత్యేక పూజలు జరిపారు. ఈనెల 27వ తేదీ ఉదయం 9.45 గంటలకు భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామివారితో పాటు 18 విగ్రహాలను ఏకకాలంలో ప్రతిష్ఠించనున్నారు.

సంపద తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎగసిపడుతున్న మంటలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగర పాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్ వాంబేకాలనీ ఆవరోడ్డులో ఉన్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం బుధవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతైంది. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి గోపీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది రాజమహేంద్రవరం రెండు, కొవ్వూరు ఒకటి అగ్నిమాపక శకటాలతో గురువారం తెల్లవారుజాము 5.30 గంటల వరకు శ్రమించి మంటలను అదుపుచేశారు. తయారీ కేంద్రంలో ఉన్న చెత్తతో పాటు మిషనరీ పూర్తిగా కాలిపోయింది. నగరపాలకసంస్థ శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారులు ప్రమాద నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అన్న విషయంపై దర్యాప్తు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బేగం గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మంటలు ఎగసిపడడంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోయారు.

ఎస్‌కేఆర్‌లో వెబినార్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఆక్వాకల్చర్‌పై జాతీయస్థాయి వెబినార్ నిర్వహించారు. జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి ప్రారంభించారు. వెబినార్‌లో ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ యు.షమీమ్, బే ఆఫ్ ఆఫ్ బెంగాల్ ప్రోగ్రాం, పాలసీ ఎనలిస్ట్ రాజ్‌దీప్ ముఖర్జీ, డాక్టర్ సీహెచ్ మంజులత విలువైన ఉపన్యాసాలు అందించారు.